

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- ఈ నెలలోనే రేషన్‌కార్డులు అందిస్తాం
- బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి ప్రభాకర్

చేర్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని చక్కబెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు పెద్దపీట వేస్తుందని బీసీ, సంక్షేమ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తూ మహిళల ఆర్థిక సంవృద్ధికి పాటు పడుతుందని ఆయన స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సంకల్పంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబసమేతంగా కొమురవెల్లి మల్లన్నను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్న అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యంతో తమ చిత్తశుద్ధి చాటుకున్నామన్నారు. అందులో భాగంగా సోలార్‌ప్లాంట్లు, మార్కెట్ మొబైల్‌స్టాల్స్ వ్యవసాయ, హార్టికల్చర్ తదితర రంగాల్లో తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇటీవలే 600 బస్సులను మహిళా సంఘాల పేరిట కొనుగోలు చేసి ఓనర్లుగా ఆర్టీసీలో కొనసాగింప చేస్తున్నామన్నారు. మహిళా సంఘాలతో ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు గోదాముల నిర్మాణం, రైస్‌మిల్లుల రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. గత బీఆర్ఎస్ సర్కారు అధికారం కోల్పోయే ముందు రూ.1.80లక్షల కోట్ల పనులకు అనుమతులు ఇచ్చిందని, రూ.40వేల కోట్లపైగా పనులకు బిల్లులు చెల్లించలేదని చెప్పారు. ఆర్థికసంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అప్పగించడంతో సరిదిద్దుదూ చక్కబెడుతున్నామన్నారు. చిన్నపాటి విషయమైన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ రెండు సీట్లు గెలవడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అవగాహనారాహిత్యమైనవని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లోకన్నా బీజేపీలోనే అంతకుమించి కుమ్ములాటలు నెలకొన్నాయన్నారు. అంతకుముందు కొమురవెల్లి మండలం ఐనాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌మంజూరు, స్థలసేకరణ విషయమై ఆర్డీవోతో చర్చించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, మల్లన్న ఆలయ ధర్మకర్త లింగంపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకుడు మేరుగు శ్రీనివాస్, యూత్‌కాంగ్రెస్ రాష్ట్రనాయకుడు బ ందిగ రాకేశ్‌కృష్ణన్, ర్యాకం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు రూ.11 వేల కోట్లు మంజూరుపై మంత్రి హర్షం

కోహెడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు రూ.11వేల కోట్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకోవడంపై మంత్రి ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటిదశలో 55 నియోజకవర్గాల్లో ఒక్క యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు రూ 200 కోట్లు చొప్పున నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. కోహెడ మండలం తంగళ్లపల్లిలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కి కూడా రూ.200 కోట్లు కేటాయించడంపై సీఎం, డిప్యూటీ సీఎంకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

రంజాన్ వేళలు

సోమవారం ఇఫ్తార్ : సాయంత్రం 6.30

మంగళవారం సహర్ : ఉదయం 5.05

నేడు ప్రజావాణి

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని నేడు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



చిన్నకోడూరులో పూజలు చేస్తున్న మధుసూదనాచారి

అభివృద్ధికి కేరాఫ్ సిద్దిపేట

- బీఆర్ఎస్ శాసన మండలి ఫ్లోర్‌లీడర్ మధుసూదనాచారి

చిన్నకోడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో అన్నిరంగాల్లో అభివృద్ధికి కేరాఫ్ సిద్దిపేట అని బీఆర్ఎస్ శాసన మండలి ఫ్లోర్ లీడర్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి పేర్కొన్నారు. చిన్నకోడూరులో జరుగుతున్న వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆదివారం ఆయన హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేను రాజకీయాల్లోకి రాక ముందు చుట్టరికానికి సిద్దిపేట వస్తే మంచినీళ్లు దొరికేవి కావని, నీళ్లకు కటకట ఉండి తాగు, సాగునీటికి గోసపడ్డ ప్రాంతమన్నారు. ఈ సమస్యలను దగ్గర నుంచి చూసిన కేసీఆర్ కేసీఆర్ పదేళ్ల పాలనలో గ్రామాల్లోని చెరువులు నీటితో కళకళలాడేలా చేశారన్నారు. గొప్ప పరిపాలన దక్షత ఉన్న వ్యక్తి కేసీఆర్ అన్నారు. ఆయన లక్షణాలను పుణికిపుచ్చుకున్న వ్యక్తి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట ప్రజలు అదృష్టవంతులని, తెలంగాణలో ఉన్న మిగతా నియోజకవర్గాలతో చూస్తే సిద్దిపేట ప్రజలు 25 సంవత్సరాలు ముందున్నారన్నారని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించి, మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ ప్రజాప్రతినిధులు పాపయ్య, ఉమేష్ చంద్ర, శ్రీనివాస్, శారద, ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు కొండం రవీందర్‌రెడ్డి, జంగిటి శ్రీనివాస్, వేణు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, రామచంద్రం, సుందరయ్య, రమేష్, విజయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ.. కల్లోలం

- జోరుగా కల్తీకల్లు విక్రయం
- జిల్లాలో 380 కల్లు దుకాణాలు
- సిద్దిపేటలోనే కల్తీ అధికం
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు!!



పోలీసులు సీజ్ చేసిన కల్తీకల్లు సీసాలు (ఫైల్)

సిద్దిపేట క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అక్రమార్జనే ధ్యేయంగా కొందరు స్వచ్ఛమైన కల్లును కల్తీ చేసి విక్రయిస్తున్నారు. తాటి, ఈత చెట్టు నుంచి వచ్చిన కల్లును ఆల్ఫాజోలం, క్లోరోఫామ్, డైజోఫామ్ ఇతరాత్ర మత్తు పదార్థాలు కలిపి కల్తీ కల్లును విక్రయిస్తున్నారు. కొందరు ఆ కల్తీకి బానిసగా మారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్‌లో కల్తీదందాకు అడ్డూఅదుపు లేకుండాపోతుంది. జిల్లాలో మొత్తం 380 కల్లు దుకాణాలున్నాయి. జిల్లాకేంద్రంలో ఒక డిపో, 10 దుకాణాలు, దుబ్బాకలో ఒక డిపో 4 కల్లు దుకాణాలు, గజ్వేల్‌లో 1డిపో 5 కల్లు దుకాణాలు ఉన్నాయి. చేర్యాల, హుస్నాబాద్‌లో గౌడ సంఘాలు ఎవరికి వారు ప్రత్యేకంగా నడుపుతున్నారు. అన్ని గ్రామాలతో కలుపుకుని అధికారికంగా 380 కల్లు దుకాణాలున్నాయి. అయితే ఉన్న దుకాణాల్లో ఎక్కువశాతం కల్తీకల్లును విక్రయిస్తూ అడ్డగోలుగా డబ్బు వసూలు చేస్తున్నారు. ఎక్కువగా జిల్లా కేంద్రంతో పాటు గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్, దుబ్బాక ప్రాంతాల్లో ఈ కల్తీ దందా జోరుగా కొనసాగుతుంది.

జిల్లాకేంద్రంలో ఒక కల్లు డిపో 10 దుకాణాలకు కల్లు సరఫరా చేస్తుంది. కూలీ పని చేసుకునేవారు మద్యం తాగడానికి డబ్బులు అంత మొత్తంలో పెట్టలేక కల్లు తాగడానికి ఇష్టపడుతుంటారు. ఒక్క కల్లు సీసా రూ.30చొప్పున విక్రయిస్తుండడంతో ఉదయం పనికి వెళ్లేప్పుడు, వచ్చేప్పుడు కల్లు తాగుతారు. కల్తీ కల్లుకు అలావాటైన వారు కూడా తెల్లవారింది మొదలు దుకాణాల ఎదు ట ఉంటున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు కల్తీ కల్లును తయారు చేస్తున్నారు. అధిక మోతాదులో మత్తుపదార్థాలను వాడడం వల్ల కల్తీకల్లు తాగి రోడ్లపై పడిపోతున్నారు. కొందరు మత్తులో వారేం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి. కొందరు రోడ్లపైకి వచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు.



సిద్దిపేటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆల్ఫాజోలం (ఫైల్)

నామ మాత్రపు తనిఖీలు

జిల్లాలో కల్తీకల్లు జోరుగా కొనసాగుతున్నప్పటికీ అబ్కారీశాఖ వారు నామ మాత్రపు తనిఖీలు చేపడుతూ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత సంవత్సరం డిసెంబర్‌లో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పలు దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి 13 గ్రాముల ఆల్ఫాజోలం, 800 లీటర్ల కల్తీ కల్లును స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఆ తర్వాత కొద్దిరోజుల పాటు వ్యాపారులు కల్తీకల్లు విక్రయించడం ఆపేశారు. మళ్లీ ఇప్పుడు అంతా మామూలు అయిపోయింది. అయితే ఈ కల్తీదందాను కొనసాగించడానికి వ్యాపారులు అధికారులకు ప్రతినెలా మామూలు ఇస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

సిద్దిపేట డిపోలోనే ఎక్కువ కల్తీ ?

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కల్లు డిపోలోనే ఎక్కువగా కల్తీ జరుగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ డిపో పరిధిలో పది కల్లు దుకాణాలు ఉన్నాయి. ఈత, తాటి వనాల నుంచి డిపోకు వచ్చిన కల్లు నుంచి కల్తీ కల్లును తయారీ చేసి దుకాణాలకు పంపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ తర్వాత దుబ్బాక, గజ్వేల్ డిపోలో కూడా కొంత వరకు కల్తీ జరుగుతున్నట్లు సమాచారం. అయితే సిద్దిపేట జిల్లా కేంద్రంలో కల్తీ జరుగుతుందని ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ దాడులు నిర్వహించడం లేదు. దీంతో అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కల్తీకల్లును విక్రయిస్తున్న దుకాణాలపై తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సిబ్బంది ఉన్నా.. సేవలు సున్నా

- రాయపోల్‌లోని ఆయుర్వేద కేంద్రానికి సుస్తీ
- డాక్టర్, సిబ్బంది డిప్యూటేషన్‌పై వెళ్లిన వైనం

8

అభ్యాసన సామర్థ్యాలపై సర్వే

- చదవడం, రాయడం, లెక్కలు చేయడంపై పరిశీలన
- ప్రభుత్వ పాఠశాలల్లో నేటి నుంచి 12 వరకు సర్వే

7

ఆర్పీల దారుణాలు

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఓ నలుగురు ఆర్పీల ఇష్టారాజ్యం!
- అవసరానికి మించి లోన్లు, అనధికారికంగా వాడకం
- మహిళలతో దుర్భాషలాడుతున్న వైనం
- బయటకు చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్న మహిళలు
- కొత్తగా గ్రూపులో చేరితే ఇష్టానుసారంగా వసూళ్లు!
- ప్రతి విషయంలో అండగా సంబంధిత అధికారి?

గజ్వేల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో మెప్మా.. ఆర్పీలకు ఉప్మాగా మారింది. రూపాయి.. రూపాయి కూడగట్టుకుని మహిళా సంఘాల్లో పొదుపు చేసుకున్న మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్పీలు ఇష్టానికి మాట్లాడుతుండగా, బయటకు చెప్పుకోలేక, ఇంట్లో వారికి చెబితే ఎక్కడ గ్రూపులో నుంచి బయటకు భయపడుతూ లోలోపల మధనపడుతున్నారు. కొత్తగా ఎవరైనా గ్రూపులో చేరే వారి నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. అవసరానికి మించిన లోన్లను ఇప్పిస్తూ.. మహిళలకు అవసరం మేర ఇచ్చిన మిగతా సొమ్మును ఓ ఇద్దరు ఆర్పీలు సొంతానికి వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇదంతా పర్యవేక్షణ చేయాల్సిన ఉన్నతాధికారులు వారికి పూర్తిస్థాయిలో సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 19 మంది ఆర్పీలు ఉంటే అందులో ఓ నలుగురి ప్రవర్తన దారుణంగా ఉందని, వారి నోటి దురుసుతనానికి అడ్డుఅదుపు లేదని తోటి ఆర్పీలే వాపోతున్నారు. ప్రతినెలా జరిగే సమావేశాల్లో మహిళలతో దుర్భాషలాడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాలను వారు బయటకు చెప్పుకోలేక లోలోన మదనపడుతున్నారు.

అడిగిన దానికి మించి లోన్లు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మెప్మా పరిధిలో 624 గ్రూపులుంటే, ఈ ఏడాది రూ.23.90 కోట్లు రుణాన్ని ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికీ రూ.22.50కోట్లు మహిళలకు బ్యాంకు లింకేజి ద్వారా రుణాలను ఇచ్చినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఇదంతా బాగానే ఉన్నా... పలువురు ఆర్పీలకు కొత్త గ్రూప్ మెంబర్ వస్తే ఆడింది ఆట... పాడింది పాటగా మారింది. వారి వద్ద నుంచి యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఓ మహిళ తనకు రూ. 50వేల రుణం కావాలని ఓ ఆర్పీని సంప్రదించగా, సదరు గ్రూపు పేరిట రూ.15 లక్షలు రుణాన్ని ఇప్పించి, నలుగురికి రూ. 2 లక్షల చొప్పున వేసి, మిగిలిన వారికి రూ.లక్ష చొప్పున ఖాతాల్లో జమ చేశారు. రూ.2లక్షలు వేసిన మహిళ నుంచి డబ్బును డ్రా చేయించి చేతిలో నుంచి గుంజుకునే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన మహిళ తాను రూ.50 వేలు మాత్రమే రుణం అడిగానని, రూ.2లక్షల రుణం ఎందుకు ఇచ్చారని ప్రశ్నించడంతో వెంటనే డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు తెలిసింది. అంతటితో సదరు మహిళ ఆగకుండా మునిసిపల్ కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయమై ఆరా తీయగా ఇద్దరు గ్రూపు సభ్యులకు జీరో అకౌంట్ ఉందని అందుకే వీరి అకౌంట్లో ఎక్కువ డబ్బులు వేయించామని సదరు ఆర్పీ బదులు ఇచ్చినట్లు తెలిసింది. జీరో అకౌంట్‌లు ఉన్న సభ్యులకు సైతం తలా రూ.లక్ష ఖాతాలో వేయడం గమనార్హం. ఇలా మరో ఇద్దరు ఆర్పీలు పలువురు మహిళల వద్ద ఇలాగే వ్యవహారం నడిపినట్లు తెలుస్తుంది. ఆర్పీలు చెల్లించని పక్షంలో సదరు సభ్యులే ఈ మొత్తాన్ని చెల్లించాల్సి వస్తుందని, కూలీ, నాలీ చేసుకునే తమకు భవిష్యత్తులో ఇబ్బందులు త ప్పవని పలువురు ఆందోళనకు గురవుతున్నారు.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కార్యాలయం

టీఎల్ఎఫ్, శ్రీనిధిలో భారీగా గోల్‌మాల్?

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మెప్మాలో గల టీఎల్ఎఫ్ (టౌన్ లెవెల్ ఫెడరేషన్)లో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. శ్రీనిధి రుణాలు ఇష్టారీతిన ఇప్పించి బాధ్యులే వాడుకున్నట్లు సమాచారం. ఇక టీఎల్ఎఫ్‌కు సంబంధించి ఆపరేటర్ లేకపోవడం, అందులోని నగదుకు సంబంధించి గోల్‌మాల్ జరిగినట్లు ఓ మహిళా సంఘం ప్రతినిధి తెలిపారు. ఇదంతా ఏళ్లుగా ఇక్కడే పాతుకుపోయిన ఓ అధికారి కనుసన్నల్లోనే జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు నడుస్తుందని మరో సంఘం మహిళ తెలిపారు. ఈ పూర్తి వ్యవహారంపై కలెక్టర్, అదనపు కలెక్టర్ దృష్టి సారించాలని ఆయా సంఘాల మహిళలు కోరుతున్నారు.





క్రికెట్ ఎఫెక్ట్...

నిన్న ఉదయం నుంచి రద్దీగా ఉన్న రహదారులు మధ్యాహ్నం 2 నుంచి నిర్మానుష్యంగా మారాయి. ఆదివారం ఇండియా-న్యూజిలాండ్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుండడంతో యువత, పిల్లలు టీవీలకు అతుక్కుపోయారు. రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన భారీతెరపై క్రికెట్ మ్యాచ్‌ను చూసేందుకు యువత అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇండియా విజయం సాధించడంతో కొందరు క్రీడాభిమానులు టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు.

\- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్

సీసీఐ కొనుగోళ్లలో అక్రమాలు.. మార్కెట్ కార్యదర్శి సస్పెండ్

హుస్నాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సీసీఐకి పత్తిని విక్రయించేందుకు నకిలీ టీఆర్‌లు (టెంపరరీ రిజిస్ట్రేషన్లు) జారీ చేసిన సంఘటనలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి దాసరి ప్రభాకర్ సస్పెండ్ అయ్యారు. శనివారం రాత్రి మార్కెటింగ్‌శాఖ డైరెక్టరు కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు తెలిపారు. సీసీఐకి పత్తిని విక్రయించేందుకు బినామీ రైతుల పేర 18 టీఆర్‌లు ఇచ్చినట్లు విచారణలో వెల్లడికావడంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు చెప్పారు. ఫిబ్రవరి 28న ఇదే విషయంలో హుస్నాబాద్ వ్యవసాయశాఖ అధికారి మామిండ్ల నాగరాజు సస్పెండ్ చేశారు. ఆయన సీసీఐకి పత్తిని విక్రయించేందుకు ముగ్గురు ఏఈవోల సంతకాలను ఫోర్జరీ చేసి బినామీ రైతుల పేర నకిలీ పర్మిట్లు ఇచ్చినట్లు విచారణలో తేలడంతో చర్యలు తీసుకున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు మెసేజ్..!!

పెద్దపల్లి జిల్లా మంథనిలో నివాసం ఉంటున్న మార్కెట్ కార్యదర్శి దాసరి ప్రభాకర్ తనను అకారణంగా సస్పెండ్ చేశారనే మనో వేదనతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు హుస్నాబాద్‌లోని పలువురు ప్రజాప్రతినిధులకు మెసేజ్ పంపించినట్లు సమాచారం. ఈ అక్రమాలకు కారణమైన పలువురి పేర్లు మెసేజ్‌లో రాసినట్లు తెలిసింది. మార్కెట్ కమిటీ పాలకవర్గంలోని కొందరు, కార్యాలయ సిబ్బంది, ఇతర వ్యక్తుల పేర్లు ప్రస్తావించినట్లు సమాచారం.

సూత్రదారులు ఎవరు...?

హుస్నాబాద్‌లో సీసీఐ పత్తి కొనుగోళ్ల గోల్‌మాల్‌లో అసలు సూత్రదారులను విడిచి పాత్రదారులపై చర్యలు తీసుకున్నారని పెద్దఎత్తున ప్రచారం జరుగుతుంది. ఈ విషయంలో మొన్న వ్యవసాయ అధికారి నాగరాజు, శనివారం మార్కెట్ కార్యదర్శి దాసరి ప్రభాకర్‌లను సంబంధిత అధికారులు సస్పెండ్ చేశారు. ఈ అక్రమాల్లో తమ ప్రమేయం లేదని సస్పెండ్ అయిన అధికారులు చెబుతున్నారు.

హుస్నాబాద్ మండలంలో నాలుగు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 9600 మంది రైతుల నుంచి 1.73 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఇందులో 18 మంది బినామీ రైతుల పేర పత్తి వేసినట్లుగా టీఆర్ (టెంపరరీ రిజిస్ట్రేషన్లు)లు వ్యవసాయ విస్తరణ అధికారుల ఫోర్జరీతో ఏఓ నాగరాజు మార్కెట్ కార్యాలయానికి పంపించగా ఈ సంఘటనపై ఈ ఇరువురిని సస్పెండ్ చేశారు. ఇందులో దాదాపు 900 క్వింటాళ్ల పత్తిని బినామీ రైతుల పేర సీసీఐ కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. అయితే మార్కెట్ పాలకవర్గంలోని కొందరితో పాటు కార్యాలయ సిబ్బంది సూత్రదారులని, వారే ఈ అక్రమాలకు కారణమయ్యారని సస్పెండ్ అయిన అధికారులు బాహటంగా వాపోతున్నారు.




హన్మంతాపూర్ పరిధిలో అనుమతులు లేకుండా తవ్విన మట్టి

తోడేస్తున్నారు

యథేచ్ఛగా చెరువులు, కుంటల్లో తవ్వకాలు
క్షేత్రస్థాయిలో కరువైన అధికారుల పర్యవేక్షణ
రెచ్చిపోతున్న ఇసుక, మట్టి మాఫియా

నర్సాపూర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలంలో పలు గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టి, ఇసుక తవ్వకాలను యథేచ్ఛగా చేపట్టి అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని హన్మంతాపూర్ పెద్దచెరువు, చింతలకుంటలలో ట్రాక్టర్‌కు మోటార్‌ను బిగించి మట్టిని ఫిల్టర్ చేసి ఇసుకగా మారుస్తున్నారు. హన్మంతాపూర్‌లోని లావుణి పట్టా భూముల్లో పెద్దఎత్తున మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఇదే గ్రామ పరిధిలో లావుణి పట్టా భూములను తోడేస్తున్నారు. సాగుకు యోగ్యంగా లేని ఈ భూములను చదును చేస్తామంటూ నమ్మబలికి మట్టిని పెద్దపెద్ద యంత్రాలతో తవ్వేస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని పలు భవన నిర్మాణాలతో పాటు ఇతర అవసరాలకు అవసరమైన మట్టిని ఇక్కడి నుంచి తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటువైపు దృష్టిసారించి అక్రమ మట్టి, ఇసుక దందాను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. నర్సాపూర్ డివిజన్ పరిధిలోని అనేక గ్రామాల్లో దందా కొనసాగుతుంది. క్షేత్రస్థాయిలో గతంలో వీఆర్‌ఏ, వీఆర్‌వోలు ఎప్పటికప్పుడు గ్రామాల్లో జరిగే విషయాన్ని మండల స్థాయి అధికారులకు సమాచారమిచ్చే వారు. ప్రస్తుతం క్షేతస్థాయి పర్యవేక్షణ లేకపోవడంతో మట్టి మాఫియా రెచ్చిపోతున్నది.

రోడ్డు ప్రమాదంలో ప్రముఖ వ్యాపారవేత్త మృతి

- ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో గట్టు రవీందర్ మృతి



గట్టు రవీందర్(ఫైల్)

సిద్దిపేట క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గట్టు రవీందర్ శనివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్టు రవి భార్య అపర్ణతో కలిసి ద్విచక్ర వాహనంపై శనివారం అర్ధరాత్రి ఓ ఫంక్షన్‌హాల్‌కు శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. నర్సాపూర్ డబుల్ బెడ్‌రూమ్ రాజీవ్ రహదారిపై ఓ వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ప్రమాదంలో గట్టు రవికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య అపర్ణకు, బైక్‌తో ఢీకొట్టిన ఓం ప్రకాష్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గాయాలైన వారిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఓం ప్రకాష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. గట్టు రవి మృతదేహానికి పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. రవి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంతాపం వ్యక్తం చేసిన హరీశ్‌రావు

గట్టు రవీందర్ మృతిపట్ల మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంతాపం తెలిపారు. మృతి బాధాకరమని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైశ్య సంఘం బలోపేతానికి కృషిచేశారని, నిత్యం సమాజ బాగుకోసం పరితపించేవారని, ఆధ్యాత్మిక ధార్మికసేవలో ముందుండి, సామాజిక సేవలో భాగస్వామ్యమయ్యే వారని గుర్తుచేసుకున్నారు.

కారులో వెళ్లి ఉంటే ఇలా జరిగేది కాదేమో - మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్



గట్టు రవీందర్ మృతిచెందడం చాలా బాధాకరం అని మాజీ ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్ అన్నారు. రాంగ్‌రూట్‌లో వచ్చిన వ్యక్తి రవీందర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఇలా జరిగిందని, ఆయన కారులో వెళ్లి ఉంటే ప్రమాదం నుంచి తప్పించుకునే వారేమో అన్నారు. చనిపోయే చివరి నిమిషం వరకు ఆయన సేవా కార్యక్రమాల్లో ఉన్నారని తెలిపారు. శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో గట్టు రవిని కలవడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకో ఫ్రీజర్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది అని రవీందర్‌కి తెలిపినప్పుడు వెంటనే స్పందించి తన మిత్రులతో కలిసి ఇప్పిస్తామని చెప్పాడనీ తెలిపారు. రోడ్డు ప్రమాదాలపైనా చర్చ జరిగిందన్నారు. కలిసి చర్చించిన గంట సేపటికే రవీందర్ మరణించిన వార్త తెలిసి చాలా బాధ కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

గజ్వేల్ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన గజ్వేల్ మండలం పరిధిలోని రిమ్మనగూడ గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన రతన్ రిషి దేవ్(42) పనినిమిత్తం గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామ శివారులోని సాయి బ్రిక్స్ కంపెనీకి వచ్చాడు. రిమ్మనగూడ వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం.. రైల్వేట్రాక్ సమీపంలో పడి గాయాలై మృతి

చేగుంట మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటి రుణం చెల్లించలేక.. మనస్తాపనతో మద్యానికి బానిసయ్యాడో యువకుడు. ఆత్మహత్యకు ప్రయత్నించగా, కిందపడి తీవ్రగాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన చేగుంట మండలం వడియారం గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన దొడ్ల రమేష్ (35) ఇంటి నిర్మాణం కోసం రామాయంపేటలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో రూ.4 లక్షల అప్పు తీసుకొన్నారు. సంవత్సరం పాటు నెలకు రూ.9,200 చెల్లించారు. మిగతా కిస్తీలు కట్టలేని పరిస్థితిలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి రమేష్ అతిగా మద్యం తాగి చేగుంట మండలం వడియారం రైల్వేట్రాక్ సమీపంలో రైలు కింద పడడానికి వెళ్లాడు. సమీపంలోనే కిందపడి తలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబసభ్యులు మెదక్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. రమేష్‌కు భార్య మమత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

వర్గల్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం వర్గల్ మండలం పరిధిలో చోటుచేసుకున్నది. సంఘటనకు సంబంధించి గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సీతారంపల్లి గ్రామానికి చెందిన తూప్రాన్ వెంకటేశంకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గత సంవత్సరం పెద్ద కూతురు పెళ్లి కోసం సుమారు రూ.2 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సిలిండర్ పేలి ఇద్దరికి గాయాలు

చేగుంట మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నార్సింగి మండల కేంద్రానికి చెందిన మైలారం సిద్ధరాములు భార్య యశోద ఆదివారం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్‌లో మంటలు చెలరేగాయి. దీంతో నిత్యావసర సరుకులతో పాటు పట్టా పాస్‌బుక్, రేషన్‌కార్డు తదితర వస్తువులు దగ్ధమయ్యాయి. యశోదతో పాటు దూరపు బంధువుకు స్వల్పగాయాలు కాగా, వారిని ఆస్పత్రికి తరలించారు.

యూనియన్ బ్యాంకులో చోరీకి యత్నం

శివ్వంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులో చోరీకి యత్నించిన సంఘటన శివ్వంపేట మండల పరిధి దొంతిలో చోటుచేసుకున్నది. దొంతి యూనియన్ బ్యాంకులో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బ్యాంకు ప్రహరీ లోపల కిటికీని ధ్వంసం చేస్తుండగా ఓనర్ కర్రె మోహన్‌కు శబ్దం వచ్చింది. వెంటనే అతడు ఎవరిని అరవడంతో దుండగులు పరారయ్యారు. బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కునాల్ గౌతం ఫిర్యాదు మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

నేషనల్ ఇంటిగ్రిటీ క్యాంపులో ప్రతిభ చాటిన వర్గల్ విద్యార్థి



బహుమతిని అందుకుంటున్న వైష్ణవి, ఆమె బృందం

వర్గల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఒడిశాలోని బరంపూర్ యూనివర్సిటీలో నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రిటటీ క్యాంపులో వర్గల్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థి వైష్ణవి విజయం సాధించి మొదటి బహుమతిని గెలుచుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ వైష్ణవి ఇంటిగ్రిటీ క్యాంపులో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా పోతరాజు, బతుకమ్మ ఉత్సవాలపై నృత్య ప్రదర్శన చేసి మొదటి బహుమతిని గెలుచుకున్నట్లు తెలిపారు. వైష్ణవిని, బృందాన్ని కళాశాల తరఫున అభినందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.రాధారాణి, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏకధాటిగా 15 గంటల పాటు ధ్యానం

రికార్డ్ సృష్టించిన జహీరాబాద్ వాసి



ధ్యానం చేస్తున్న జ్ఞానేశ్వర్

కల్హేర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : ఏకధాటిగా 15 గంటల పాటు ధ్యానం చేసి రికార్డు సృష్టించాడు జహీరాబాద్‌కు చెందిన జ్ఞానేశ్వర్. సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం గజేంద్ర ఆశ్రమంలో అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ధ్యానం తరగతులను నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జ్ఞానేశ్వర్ శనివారం సాయంత్రం 5 గంటలకు ధ్యానం ప్రారంభించగా ఆదివారం ఉదయం 8 గటంల వరకు ఏకధాటిగా చేశారు. జ్ఞానేశ్వర్ ధ్యానం చేసి రికార్డు సృష్టించినట్లు అంతర్గాం పిరమిడ్ ధ్యాన్య కేంద్రం బాధ్యులు డాక్టర్ నారాయణరావ్, గుండెరావ్ తెలిపారు. అనంతరం జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ధ్యానం చేయడంతో ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. మానవుడి శక్తి ధ్యానంలో ఉందని, ప్రతీ రోజు గంటల తరబడి ధ్యానం చేయడంతో అనేక కలిగే ప్రయోజనాలు ఉంటాయన్నారు. జ్ఞానేశ్వర్‌ను గజేంద్ర ఆశ్రమ ఉప పీఠాధిపతి అవధూత్ మహారాజ్ సన్మానం చేసి ఆశీర్వదించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దుబ్బాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడిని ఆటో ఢీకొనడంతో మృతిచెందిన సంఘటన దుబ్బాక మండల పరిధిలో ఆదివారం చోటచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. దుబ్బాక మండలం పోతారం గ్రామానికి చెందిన ఎర్రోల్ల నరేష్(28) ఒక కుమారుడు ఉండగా, నెల రోజుల క్రితం తన భార్య సంధ్యకు రెండో సంతానంగా కుమార్తె పుట్టింది. పుట్టింటి వద్ద ఉన్న భార్యను తీసుకుని రావడానికి ఆదివారం ఉదయం కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం మల్కాపురం గ్రామానికి నరేష్ ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మండలంలోని ఆకారం శివారులో ఎదురుగా వస్తున్న ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. దీంతో తలకు బలమైన గాయాలైన నరేష్ అక్కడిక్కడే మృతిచెందారు. నరేష్ తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

● భార్యాభర్తలకు గాయాలు



గౌరాయపల్లి వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

కొండపాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టిన సంఘటనలో భార్యాభర్తకు తీవ్రగాయాలైన సంఘటన కొండపాక శివారులో రాజీవ్‌రహదారిపై ఆదివారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ సనత్‌నగర్‌కు చెందిన భార్యాభర్తలైన సందీప్, అనిలా ధర్మపురికి దైవ దర్శనానికి వెళ్తున్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి కమాన్ దాటాక కొండపాక శివారులో గౌరాయపల్లి వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కొండపాక 108 సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ మహేందర్, పైలట్ మహేష్ ఘటన ప్రాంతానికి చేరుకుని వారికి ప్రథమ చికిత్స అందించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కోనేరు నీటిలో మునిగి బాలుడి మృతి

● మద్యం మత్తులో ఉన్న మామతో కలిసి ఈత కొడుతుండగా ఘటన



కరుణాకర్ మృతదేహం

శివ్వంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : దైవదర్శనానికి వచ్చి కోనేరులో నీట మునిగి బాలుడు మృతిచెందిన సంఘటన సికింద్లాపూర్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. ఆలయ సిబ్బంది, భక్తులు తెలిపిన వివరాల మేరకు.. మచ్చ బొల్లారం గ్రామానికి చెందిన కరుణాకర్(14) స్థానిక శ్రీ శ్రీ జ్ఞాన మందిర్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మామయ్య శివకుమార్ మండల పరిధిలోని సికింద్లాపూర్ జాతరకు వచ్చాడు. శివకుమార్ మద్యం తాగి కోనేరులో దిగి ఈత కొడుతుండగా బాలుని పిలిచి ఈత కొట్టించాడు. ఈ క్రమంలో బాలుడు నీట మునగడంతో 108 వాహనం సహాయంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కరుణాకర్ మృతిచెందాడు.

చేపల వేటకు వెళ్లి యువకుడు..

రామాయంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన మత్స్య కార్మికుడు మృతిచెందిన సంఘటన ఆదివారం రామాయంపేట మున్సిపల్ పరిధి గుల్పర్తిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పేరాని నర్సింహులు(25) ఉదయం తోటి మత్స్యకార్మికులతో కలిసి ఎక్కల్‌దేవ్ చెరువులో చేపల కోసం దిగారు. జేసీబీ గుంతలో పడిపోగా నీటమునిగి ఈతరాక ఊపిరాడక చనిపోయాడు. నర్సింహులు మృతదేహం కోసం నాలుగు గంటలపాటు జాలర్లు వెతకగా, గ్యాస్ కంప్రెసర్ సహాయంతో సాయంత్రం వెలికి తీశారు. నర్సింహులుకు భార్య భవాని, రెండేళ్ల కూతురు ఉన్నది. నర్సింహులు ఐదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన చిన్న మల్లేశం ఇంటికి ఇల్లరికం వచ్చాడు. కాగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించడంతో కుమారుడి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి



విజయేందర్‌రెడ్డి (ఫైల్)

వర్గల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : చదువుకోకుండా ఎందుకు తిరుగుతున్నవని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం చాంద్‌ఖాన్‌మక్తా గ్రామానికి చెందిన మార్కంటి విజయేందర్‌రెడ్డి(16) చౌదర్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. 6వ తేదీన పొలం వద్ద పనులలో ఉన్న తల్లి కనకవ్వ వద్దకు సాయంత్రం 6 గంటల సమయంలో విజయేందర్‌రెడ్డి వెళ్లాడు. ఇంట్లో ఉండి చదువుకోకుండా తిరుగుతూ పొలం వద్దకు ఎందుకు వచ్చవని తల్లి విజయేందర్‌రెడ్డిని మందలించగా తీవ్ర మనస్తాపానికి గురైన అతడు అక్కడే ఉన్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన తల్లి స్థానికుల సహాయంతో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. తల్లి కనకవ్వ ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త మృతి తట్టుకోలేక గుండెపోటుతో భార్య మృతి



కొమురవ్వ(ఫైల్)

చేగుంట మర్చి 9 (ఆంధ్రజ్యోతి): భర్త మృతితట్టుకోలేక మూడు రోజుల వ్యవధిలో భార్య గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మండలం పరిధిలోని ఆదివారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్‌పల్లి గ్రామానికి చెందిన చింతాకుల అయ్యాలం (70) ఈనెల 7న అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త మృతిచెందిన మూడోరోజే భార్య చింతాకుల కొమురవ్వ(60)కు గుండెపోటు వచ్చి మృతిచెందారు. అయ్యాలం, కొమురవ్వకు నలుగురు సంతానం ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కొడుకులు. కుమారులు కనకయ్య, రాజు గ్రామంలోని వేరు కాపురం ఉంటున్నారు. తల్లిదండ్రులు వేరే దగ్గర ఉంటూ జీవనం సాగిస్తున్నారు. పదేళ్లుగా భర్త పక్షవాతంతో బాధపడుతూ ఉండటంతో భార్య కొమురవ్వ చూసుకుంటూ ఉండేది. ఈ క్రమంలో భర్త అయ్యాలం మృతిచెందడంతో భార్య మనోవేదన గురై గుండెపోటుతో మృతి చెందారు. మూడు రోజుల వ్యవధిలోనే భర్త, భార్య మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.





దర్శనం కోసం ఉచిత, ప్రత్యేక క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు, బుకింగ్ కార్యాలయం వద్ద భక్తుల రద్దీ

మల్లన్నకు నీరాజనం

హోరెత్తిన ఎనిమిదో వారం జాతర

స్వామివారి దర్శనానికి 4 గంటల సమయం

కుటుంబసమేతంగా మంత్రి పొన్నం పూజలు

చేర్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదో వారం జాతర హోరెత్తింది. ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. బోనం నివేదించి పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మకు కల్లు, బెల్లం పానకం శాకపెట్టి బోనం నివేదించారు. గంగిరేగుచెట్టుకు ముడుపులుకట్టారు. ఆలయ ఈవో రామాంజనేయులు, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చేర్యాల సీఐ ఎల్.శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంతి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆదివారం కుటుంబసమేతంగా ఆలయాన్ని సందర్శించారు. సంప్రదాయబద్ధంగా బోనం నివేదించి పట్నం రచించిన స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం జరిపి మొక్కులు తీర్చుకున్నారు.



గర్భాలయంలో కుటుంబంతో మంత్రి పొన్నం



దేవతావాహనంతో సిగమూగుతున్న ఆచారవతులు

ఉక్కపోత, దాహార్తి తీర్చుకోలేక ఇబ్బందులు

ఏడువారాలకు భిన్నంగా భక్తులు భారీగా తరలిరావడంతో ఉచిత, వీఐపీ, ప్రత్యేక దర్శన క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. స్వామివారి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. ఎండలు మండిపోవడంతో తాత్కాలిక తడకల పందిళ్లలో గంటల తరబడిగా వేచిఉన్న భక్తులు ఉక్కబోతకు గురయ్యారు. ఆలయం తరపున వాటర్ ప్యాకెట్లను అందజేసినప్పటికీ సరిపడకపోవడంతో దాహార్తి తీర్చుకోలేక తల్లడిల్లారు.

పొంగిపొర్లిన డ్రైనేజీ నీరు

మల్లన్న ఆలయ పరిధిలోని కోడెల స్తంభం ఆవరణలో డ్రైనేజీ ఆదివారం ఉదయం పొంగిపొర్లింది. వసతి గృహాలతోపాటు గ్రామపంచాయతీ పరిధిలోని వసతిగృహాల మురుగునీటి మళ్లింపు కాలువ దెబ్బతినగా మరమ్మతుల పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తాయి.

టికెట్ లేకుండానే వీవీఐపీ దర్శనం

● డబ్బులు దండుకుంటున్న వలంటీరు

చేర్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) కొమురవెల్లి మల్లన్న ఆలయంలో తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న ఓ వలంటీర్ భక్తుల నుంచి డబ్బు పొంది టికెట్ ఇవ్వకుండా వీవీఐపీ క్యూలైన్ గుండా దర్జాగా దర్శనానికి పంపించి పట్టుబడ్డాడు. ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మల్లన్న దర్శనార్థం ఆలయానికి విచ్చేయడంతో ఆలయ వర్గాలు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇదే అదనుగా ఓ వలంటీర్ పలువురు భక్తుల నుంచి రూ.500 వీవీఐపీ టికెట్‌కు ఫోన్‌పే ద్వారా రూ.1000 వసూలు చేశాడు. టికెట్ ఇవ్వకుండానే వీవీఐపీ క్యూలో తమకు తెలిసిన వ్యక్తులని ఆలయ వర్గాలకు సూచించి పంపించాడు. కాసేపటికి అనుమానం కలిగిన ఆలయ వర్గాలు భక్తులను పిలిచి ఆరా తీయడంతో వలంటీర్ ఎవరో తమకు తెలియదని, డబ్బిస్తే దర్శనానికి పంపిస్తామని చెప్పడంతో ఫోన్ పే చేసినట్లు పేర్కొన్నారు. ఆది నుంచి వలంటీర్ల పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నా పర్యవేక్షణ లేకపోవడంతో భక్తుల జేబులకు చిల్లులు పెడుతూ, ఆలయ ఆదాయానికి గండిపెడుతున్నారు. ఈవిషయమై ఈవో రామాంజనేయులును వివరణ కోరగా గ్రామానికి చెందిన శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు వలంటీరు వసూళ్ల గురించి తెలిపారని, సోమవారం విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పట్నంవేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

వనదుర్గమ్మ క్షేత్రం.. భక్తజన కోలాహలం



ఏడుపాయలలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాపన్నపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లావాసులతో పాటు పరిసర జిల్లాలు, జంట నగరాలు, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు అమ్మనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం దర్శనం కల్పించారు. మంజీరా నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మాతను దర్శించుకున్నారు. బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



వనదుర్గామాత

ఉన్నత లక్ష్యాలను సాధించాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. హవేళిఘణపూర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆదివారం తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, స్టోర్‌రూం, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రయోగశాలలు, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార వస్తువుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వంటగది, మూత్రశాలలు, మరుగుదొడ్లల్లో పరిశుభ్రతా చర్యలు నిత్యం పాటించాలన్నారు. పాఠశాలల్లో అందుతున్న సేవల గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మెనూను పక్కగా అమలు చేయాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో, వసతి గృహాల్లో పరిశుభ్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. పాఠశాల రిజిస్టర్‌లల్లో వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులున్నారు.



స్టోర్‌రూంలో కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్

జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో అ'పూర్వ' సమ్మేళనం

గజ్వేల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. దాదాపుగా 12 ఏళ్ల బ్యాచ్‌లకు సంబంధించిన విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. గతంలోని తమ అనుభవాలను ఒకరినొకరు పంచుకుని ప్రస్తుతం వారి హోదాలను తెలుపుకుంటూ పరిచయం చేసుకున్నారు. గతంలో తాము చేసిన చిలిపి పనులను, చేష్టలను గుర్తు చేసుకుంటూ తమ అధ్యాపకులతో తమకు ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. మహాసమ్మేళనంలో గతంలో పనిచేసిన ప్రిన్సిపాళ్లతో పాటు అధ్యాపకులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి ప్రస్తుత రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్ కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశం విజయవంతం కావడం పట్ల మహా సమ్మేళన కన్వీనర్ మ్యాజిక్ భాస్కర్ హర్షం వ్యక్తంచేశారు. సమ్మేళనం విజయవంతానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన మహాసమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు



అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అభ్యాసన సామర్థ్యాలపై సర్వే



చదవడం, రాయడం, లెక్కలు చేయడంపై పరిశీలన

ప్రభుత్వ పాఠశాలల్లో నేటి నుంచి 12 వరకు సర్వే

కొండపాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు అంచనా వేసేందుకు విద్యాశాఖ సర్వేకు శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి బుధవారం వరకు ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ సర్వే నిర్వహించనున్నారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో లోటుపాట్ల సవరణతో పాటు మరింత అభివృద్ధి పరిచేందుకు దోహదపడేలా సర్వేను రూపొందించారు.

నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో

నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంగా ప్రతీ విద్యార్థి సొంతంగా చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు సాధించేలా కృత్యాధార బోధన కొనసాగేలా పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో బోధనలు, చిన్నారుల చదువులెలా సాగుతున్నాయో గుర్తించేందుకు సర్వే చేపట్టనుంది. సిద్దిపేట జిల్లాలో ఎంపిక చేసిన 50 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మూడు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. రెండో తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. సర్వేలో తేలిన అంశాల ఆధారంగా కనీస సామర్థ్యాలకు మరింత మెరుగైన బోధన ప్రక్రియ నిర్ణయించనున్నారు.

చతుర్విధ ప్రక్రియలపై పరిశీలన

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యార్థులు రాణించాలని, అభ్యాసన ప్రక్రియ మెరుగు పరిచేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ, లోకల్‌బాడీ పాఠశాలల్లో కార్యక్రమం అమలు తీరుపై ఎఫ్ఎల్ఎన్ శాంపిల్ సర్వేను ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు చేపట్టనున్నారు. ఈ విషయమై పలువురు కళాశాల విద్యార్థులకు, సీఆర్పీలకు జిల్లా స్థాయిలో శిక్షణ సైతం అందించారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌లకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లి రోజుకోకటి తెలుగు, ఆంగ్లంలో చదవడం, రాయడంతో పాటు గణిత ప్రక్రియలు పరీక్షించనున్నారు. ఒక్కో విద్యార్థి ఏ మేరకు నేర్చుకున్నారు, ఇంకా ఏం కావాలి.. తదితర వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేయనున్నారు.

ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు

ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం హాజరు ఉండేలా చూడాలని, సర్వే నిర్వహణకు సహకరించాలని మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలను జిల్లా విద్యాశాఖ ఆదేశించింది. సర్వే నిర్వహణపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించింది. ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి ఎక్కడా ఇబ్బందులు లేకుండా సర్వే కొనసాగేలా చూడాలని ఆదేశాలు జారీ చేసింది.

ప్రత్యేక యాప్‌లో నమోదు



మూడు రోజుల పాటు రోజుకు ఒకటి చొప్పున తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులపై విద్యార్థుల సామర్థ్యాలను సర్వే ద్వారా పరిక్షిస్తారు. ఇది పూర్తి సాంకేతికతతో నిర్వహిస్తున్నటువంటి సర్వే. సిద్దిపేట జిల్లాలో 50 పాఠశాలలు, మూడు ఉర్దూ మీడియం పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పరీక్షలు నిర్వహించడానికి 55 మందిని నియమించాం. పరీక్ష ఎలా నిర్వాహించాలో ఇప్పటికే వారికి శిక్షణ కూడా అందించారు.

- బేతి భాస్కర్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్

సిబ్బంది ఉన్నా.. సేవలు సున్నా

● రాయపోల్‌లోని ఆయుర్వేద కేంద్రానికి సుస్తీ
● డాక్టర్, సిబ్బంది డిప్యూటేషన్‌పై వెళ్లిన వైనం
● అధికారులు చొరవ చూపాలని ప్రజల వినతి

రాయపోల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఆయుర్వేద వైద్యం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ముఖ్యంగా కీళ్లనొప్పులు, చర్మవ్యాధులు, దగ్గు, జ్వరం, జలుబు, స్త్రీల, గుండె సంబంధిత వ్యాధులకు ఇక్కడ మెరుగైన చికిత్స లభించేది. కానీ క్రమేణా ఇంగ్లిష్ మందులు వినియోగం పెరడంతో ఆయుర్వేదానికి ఆదరణ కరువైంది. పలువురు వృద్ధులు ఇప్పటికీ ఆయుర్వేద వైద్యాన్నే నమ్ముతున్నారు. వీరికోసమైనా ఆయుర్వేద వైద్యాలయం సేవలు అందించాల్సి ఉన్నది. కానీ సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలోని ఆయుర్వేద వైద్యాలయంలో సేవలు కరువయ్యాయి. సిబ్బంది ఉండి కూడా మూతపడడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయపోల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలోనే ఆయుర్వేద, యునాని వైద్య కేంద్రాలు ఉన్నాయి. ఏడాది క్రితం వరకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు తరచుగా ఈ ఆయుర్వేద కేంద్రంలో జబ్బులను పరీక్షించుకొని మందులు తీసుకెళ్తూ ఉండేవారు. కానీ ఏడాదికి పైగా ఇది మూతపడడంతో ఆయుర్వేదాన్ని నమ్ముకున్న రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు.


రాయపోల్‌లోని ఆయుష్ కేంద్రం

డిప్యూటేషన్‌పై వెళ్లడంతో..

రాయపోల్ ఆయుర్వేద వైద్య కేంద్రానికి డాక్టర్, ఫార్మసిస్ట్, అటెండర్ పోస్టులన్నీ భర్తీ అయినప్పటికీ దురదృష్టవశాత్తు ఒక్కరూ ఇక్కడ పనిచేయడంలేదు. ఇక విధులు నిర్వహించాల్సిన డాక్టర్ ప్రశాంత్ ఏడాది క్రితం హుస్నాబాద్ ప్రాంతానికి డిప్యూటేషన్‌పై వెళ్లగా, ఫార్మసిస్ట్ రేణుక ఏడాది నుంచి హైదరాబాద్‌లో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. అటెండర్ వెంకటేశం మాత్రం మూడు రోజులు సిద్దిపేటలో, మరో మూడు రోజులు రాయపోల్‌లో పనిచేస్తున్నారు. డాక్టర్‌తో సహా సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండకపోవడంతో వైద్య కేంద్రానికి వచ్చే రోగులు దాదాపుగా బందయ్యారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని ఇక్కడి సిబ్బంది ఇక్కడనే పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కేంద్రంలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ


రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

నేడు కిష్టస్వామి కల్యాణం

కోహెడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కోరిన కోరెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కోహెడ మండలంలోని తంగలపల్లి గుట్టపై ఉన్న వేణుగోపాల స్వామి (కిష్టస్వామి) నవాహ్నిక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఉత్సవాలు 15 వరకు కొనసాగనున్నాయి. సోమవారం గరుడ హోమం, ధ్వజారోహణం, రాత్రి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. అందుకోసం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పీటీఎస్‌ల రాష్ట్ర కమిటీ ఎన్నిక

ములుగు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల పార్ట్ టైం స్వీపర్స్(పీటీఎస్) రాష్ట్ర కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడు ఎలగందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ములుగు మండలం బండమైలారంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా జిల్లాలకు చెందిన వారు పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడిగా పిట్టా హుస్సేన్(నేరేడుచర్ల బ్రాంచ్), ప్రధాన కార్యదర్శిగా కస్తాల మధు(హుజూర్‌నగర్ బ్రాంచ్), ఉపాధ్యక్షుడిగా సీహెచ్ ఎల్లం(ములుగు), హద్నూరు అంకుష్‌కుమార్(సంగారెడ్డి జిల్లా), కోశాధికారిగా ఖమ్మంపాటి మధుసూదన్(పెన్ పహాడ్ బ్రాంచ్), సహాయ కార్యదర్శిగా సయ్యద్ సలీం(ఆసిఫాబాద జిల్లా), చెరుకుపల్లి స్వామి (మంచిర్యాల జిల్లా)తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యే పల్లాను కలిసిన జేఏసీ నాయకులు

చేర్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల జేఏసీ నాయకులు ఆదివారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ సమావేశాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశాన్ని అసెంబ్లీలో చర్చకు తీసుకువచ్చేలా కృషి చేయాలని కోరారు.

చిట్టాపూర్‌లో రక్తదాన శిబిరం

దుబ్బాక, మార్చి9 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలో ఆదివారం 5వ మహా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచు రాజయ్య, ఉదయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాతల నుంచి 15 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. గ్రామస్థులు సాయి, పూర్ణ, సాయి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

కొండపాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం దుద్దెడ గ్రామ అంబేడ్కర్ సంక్షేమ సంఘం కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా కొమ్ము లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా పల్లె రాజశేఖర్, కోశాధికారిగా బాకి రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా అశోక్, కొమ్ము నర్సింహులు, సహాయ కార్యదర్శులుగా బాకి కరుణాకర్, పల్లే సురేష్, క్రీడల కార్యదర్శిగా కాటపాక సంపత్, ప్రచార కార్యదర్శులుగా నాగరాజు, రామకృష్ణ, సాంస్కృతిక కార్యదర్శిగా బాబు, కార్యనిర్వాహణాధికారిగా గోపాల్ నియమితులయ్యారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

హుస్నాబాద్ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని సిద్ధేశ్వర గుట్టపై వెలిసిన అయ్యప్ప స్వామి దేవాలయ 23 వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యావచనం, అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు, విశేష కార్యక్రమాలు దివ్య పదునెట్టంబడి పూజ, గణపతి హోమాలను నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చెర్మన్ ఆకుల వెంకట్, సుద్దాల చంద్రయ్య, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత తదితరులు పాల్గొన్నారు.


హోమంలో పాల్గొన్న భక్తులు

ప్రత్యక్ష దైవాలకు పాదాభివందనం


క్రాంతి హైస్కూల్‌లో తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

సిద్దిపేట అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం, మానవ విలువలు నేర్పించడానికి సిద్దిపేటలోని మైత్రివనంలో గల క్రాంతి హై స్కూల్ నిర్వాహకులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు వారి పిల్లల చేత పాదపూజ చేయించి సత్కరింపజేశారు. అదేవిధంగా జీవితాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారి తల్లిదండ్రులను కూడా ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా స్వాగతించి వారిని కూడా ఘనంగా సన్మానించారు. ఐఏఎస్ అధికారి అఖిల్ బుద్ధి తల్లిదండ్రులు, నలుగురు ఎంబీబీఎస్ డాక్టర్లను తీర్చిదిద్దిన తల్లిదండ్రులు, ఐఐటీ, గ్రూప్స్ ర్యాంకులు పొందిన వారి తల్లిదండ్రులను వేదికపై సత్కరించారు. కార్యక్రమంలో బీ స్మార్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి, క్రాంతి పాఠశాల చైర్మన్ భగవాన్ రెడ్డి, డైరెక్టర్ అర్పితా రెడ్డి, ప్రిన్సిపాల్ కుమారస్వామి, మోటివేషన్ స్పీకర్లు రంజిత్, శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారి బేతి భాస్కర్, అడ్వైజర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


కొండపాకకు చెందిన ఐఏఎస్ అధికారి అఖిల్ బుద్ధి తల్లిదండ్రులను సన్మానిస్తున్న పాఠశాల నిర్వాహకులు

సాగునీటి కష్టాల నుంచి రైతులను ఆదుకోవాలి

● సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అశోక్



మాట్లాడుతున్న అందె అశోక్

చేర్యాల, మార్చి 9 (ఆంధ్ర జ్యోతి) : పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారని, పార్టీబేధం లేకుండా రాజకీయస్వార్థం వీడి సాగునీటి కష్టాలనుంచి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ అన్నారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రాంతంలో ప్రజలు, రైతులు తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితులలో రంగనాయక సాగర్ కాల్వ నుంచి చేర్యాల, ధూళిమిట్ట మండలాల చెరువులకు నీటిని మళ్లిస్తే నంగునూరు ప్రాంత రాజకీయనాయకులు రైతులను ఉసిగొల్పి అడ్డుకునే ప్రయత్నం చేయడం తగదన్నారు. గతంలో తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలానికి నీళ్లు మళ్లించుకుపోయినా తాము అడ్డుకోలేదని గుర్తుచేశారు. ప్రాంతాలమధ్య గొడవలు సృష్టించకుండా పంటలు ఎండకుండా చూడాలని, లేని యెడల రైతుల గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇలాంటి దుశ్చర్యలను తాము ఖండిస్తామని, పునరావృతమైతే ప్రతిఘటించి రైతుల ప్రయోజనాలు కాపాడుతామన్నారు. సమావేశంలో నాయకులు ఈరు భూమయ్య, వలబోజు నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

రాయపోల్‌కు మహా పాదయాత్ర

రాయపోల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సద్గురు సిద్ధలింగేశ్వర స్వామి నిర్వహిస్తున్న మహాపాదయాత్ర ఆదివారం రాయపోల్‌కు చేరుకుంది. గ్రామస్థులు, భక్తులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ యాత్రలో వివిధ ప్రాంతాలకు చెందిన స్వాములు నాగభూషణస్వామి, సంతోష్‌స్వామి, బసవరాజస్వామి, రాజాస్వామిజీ, సిద్ధేశ్వర మహారాజ్, రామదాస్ స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ యాత్ర భక్తుల ధార్మిక చైతన్యాన్ని పెంపొందించడానికి, హిందూ ధర్మ సంరక్షణ కోసం, సద్గురు రేణుకాచార్య స్వామీజి సేవలను గుర్తు చేసేందుకు చేపట్టామని తెలిపారు. నిజామాబాద్ జిల్లా సుంకిని గ్రామంలో మొదలైన ఈ మహాపాదయాత్ర యాదాద్రి జిల్లా కొలనుపాకకు చేరుకోనుందని పేర్కొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభం


కొండపాక : దుద్దెడలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నర్సారెడ్డి

కొండపాక/ములుగు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలంలోని దుద్దెడ, రాంపల్లి, ములుగు మండలంలోని తునికిబొల్లారంలో సీసీ రోడ్డు పనులను మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కనీస వసతుల కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగరావు, నాయకులు అనంతుల నరేందర్, వెంకటేశం, సుదర్శన్, పరశురాములు, కొమ్ము మల్లికార్జున్, సురేందర్, శ్రీకాంత్, సురేందర్, అంబటి రాజు, అంజయ్య, సిద్దులు, వడ్లకొండ రాజు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

● మిరుదొడ్డి, మార్చి9 (ఆంధ్రజ్యోతి) : అక్బర్‌పేట-భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో చేపడుతున్న ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటస్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రతాప్, అనంతుల శ్రీనివాస్, వెంకటేశం, రాజిరెడ్డి, బాలాగౌడ్, చంద్రసాగర్ పాల్గొన్నారు.


మిరుదొడ్డి : తాళ్లపల్లిలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఇంకెప్పుడు ఏర్పాటు చేస్తారు?

● ధూళిమిట్ట ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటుపై నీలినీడలు
● భవనం ఎంపికపై రాని స్పష్టత
● బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జి ఎంపీడీవో



ధూళిమిట్ట, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్దూర్ మండలం నుంచి 11 గ్రామాలతో ధూళిమిట్ట మండలం ఏర్పాటైంది. గతంలో స్థానిక ఎన్నికలు ఉమ్మడి మండల కేంద్రంగా జరిగిన నేపథ్యంలో ఇప్పటివరకు మండల పరిషత్ కార్యాలయం ఉమ్మడిగానే కొనసాగింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలో నూతనంగా ఏర్పాటైన అక్బర్‌పేట-భూంపల్లి, కుకునూర్‌పల్లి, ధూళిమిట్ట మండల కేంద్రాల్లో మండల పరిషత్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తూ గతేడాది నవంబర్‌లో జీవో జారీ చేసింది. దీనికి అనుగుణంగా జిల్లా ఉన్నతాధికారులు ఆయా మండలాలకు ఇన్‌చార్జీ ఎంపీడీవోలను సైతం కేటాయించారు. అక్బర్‌పేట-భూంపల్లి, కుకునూర్‌పల్లి మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాలు ప్రారంభమై కార్యకలాపాలు నిర్వహిస్తున్నా ధూళిమిట్ట మండల ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటుపై మాత్రం నీలినీడలు అలుముకున్నాయి.

భవనంపై స్పష్టత కరువు...

కార్యాలయం కోసం మండల కేంద్రంలో ఉన్న పలు ప్రభుత్వ భవనాలు, స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఉమ్మడి మద్దూర్ మండల ఎంపీడీవో రాంమోహన్, తహసీల్దార్ మధుసూదన్ పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. అయినా ఇప్పటికే భవనంపై స్పష్టత రాలేదు. అంతేకాకుండా ధూళిమిట్ట మండలానికి పొరుగున ఉన్న నంగునూర్ ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ ప్రభాకర్‌రావును తొలుత ధూళిమిట్ట మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. ఆరోగ్య సమస్యల కారణంగా విధుల్లో చేరలేకపోతున్నట్లు ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో నారాయణరావుపేట మండల ఎంపీవోకు ధూళిమిట్ట మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినా ఇంకా విధుల్లో చేరలేదు. ఇప్పటికైనా కలెక్టర్, సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు, ఎంపీడీవో నియామకానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



సిద్దిపేట అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట అర్బన్ మండలం బక్రి చెప్యాల గ్రామానికి చెందిన మల్లోజీ లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చొరవతో గ్రామ మాజీ ఎంపీటీసీ గాలవ్వ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం యాదగిరి, గ్రామా శాఖ అధ్యక్షులు మధు, జక్కుల కనకయ్య, మల్లేశం, చంద్రం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి పూజలు

రాయపోల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం వడ్డెపల్లిలో జరుగుతున్న వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం అన్నపూజ, ఆకుల పూజ నిర్వహించారు. రాత్రి ఉమామహేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.


విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదు

● గజ్వేల్ బీఆర్ఎస్ నాయకులు

గజ్వేల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌ను విమర్శించే నైతిక అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ... 15 నెలల కాంగ్రెస్ పాలనలో గజ్వేల్‌కు ఒరిగింది శూన్యమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మాట్లాడితే అధికారంలో ఉండి చేసే చేతకాక కేసీఆర్‌ను విమర్శించడం మూర్ఖత్వమన్నారు. సాగు, తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిన నాయకుడు కేసీఆర్ అని, రైల్వేలైన్, జిల్లా ఆసుపత్రి, ఎడ్యూకేషన్‌హబ్, రింగ్‌రోడ్డు లాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. గతంలో నిర్వాసితుల వద్దకు వచ్చి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి 15 నెలలైనా వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోవడం ఆయన చేతకానితనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు బొగ్గుల చందు, మర్కంటి కనకయ్య, మామిడి శ్రీధర్, సీర్ల మల్లేశంయాదవ్, రమేశ్‌గౌడ్, ఉమర్, నిజాముద్దీన్, శివకుమార్, హనుమంతరెడ్డి, అక్రమ్, స్వామి ఉన్నారు.

నీటిని విడుదల చేయాలని వినతి


ఎంపీని కలిసిన కొండపాక మండల నాయకులు, రైతులు

కొండపాక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పంటలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎంపీ రఘునందన్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. నీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని, తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని చెరువులను నింపి సాగునీరు అందించాలని కోరారు. స్పందించిన ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయాలని చెప్పినట్లు వారు పేర్కొన్నారు.

హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం


హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు


సిద్దిపేట రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా పంటలు ఎండిపోకుండా కాళేశ్వరం జలాలు విడుదల చేయించిన రైతుల ఆత్మబంధువు మాజీ మంత్రి హరీశ్‌రావు అని సర్పంచ్‌ల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు రోమాల శంకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం నారాయణరావుపేట మండలం బంజేరుపల్లి గ్రామంలో హరీశ్‌రావు చిత్రపటానికి రైతులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. గ్రామ రైతులం ముడేళ్లుగా రంగనాయక సాగర్ ప్రాజెక్టుతో రెండు పంటలు పండించుకుంటున్నామని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పిట్ల శంకర్, సూతారి వెంకట్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ డప్పుల ప్రదర్శన


ములుగులో డప్పులతో ర్యాలీ తీస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాయపోల్/ములుగు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం వివిధ గ్రామాల నుంచి నాయకులు డప్పులతో భారీగా తరలివచ్చి రాయపోల్, ములుగు మండల కేంద్రాల్లోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో కొన్ని అవకతవకలు జరిగాయని, వాటిని సవరించి మాదిగల జనాభా ప్రకారం 11 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రూపులుగా కాకుండా ఏబీసీడీలుగా వర్గీకరించాలన్నారు. మాదిగ ఎమ్మెల్యేలకు క్యాబినెట్‌లో రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఈఎఫ్ ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుర్ర నర్సింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగ మహేష్, రాయపోల్ మండల అధ్యక్షుడు అయ్యగాల్ల రవి, ములుగు మండల అధ్యక్షుడు ఆదాస్ మహేష్, జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు రాజు, ములుగు మండల ఉపాధ్యక్షుడు రాముని మల్లేష్, కార్యదర్శి కొమ్ము వినోద్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు తోడేటి నవీన్, సంతోష్, నర్సింహులు, రామోల్ల స్వామి, చిరంజీవి, లక్ష్మణ్, నర్సింగరావు, ప్రకాశ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జయమ్మకు ఆదర్శ మహిళ అవార్డు


అవార్డు అందుకుంటున్న జయమ్మ

జగదేవ్‌పూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన మండల ముదిరాజ్ సంఘం మహిళా అధ్యక్షురాలు కొన్నె జయమ్మకు రాష్ట్ర ఆదర్శ మహిళ అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మండలం ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాగుల రాజు, పిట్టల నర్సింహులు, తిగుళ్ల బాలకిషన్ తదితరులు ఉన్నారు.